నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 కరీంనగర్, శుక్రవారం 1 మార్చి 2024 RAJANNA SIRCILLA


గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి చెరువుకట్టపై రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, పక్కన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

# రైతుల ఉసురు పోసుకోవద్దు

- యాసంగి పంటలు ఎండక ముందే సాగునీరివ్వాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్

గన్నేరువరం, ఫిబ్రవరి 29: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు కండ్లముందే ఎండిపోతుంటే రైతులు రోదిస్తున్నారని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకోవద్దని, సకాలంలో సాగునీరందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గన్నేరువరం మండలం చీమలకుంటపల్లిలో సాగునీరందక ఎండుతున్న పంట పొలాలు, నెర్రెలు వారిన చెరువు, సాగునీటి కాలువను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేసీఆర్ సర్కారు పాలనలో ఎప్పుడు అవసరముంటే అప్పుడు సాగునీరు వచ్చేదని గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎండుతున్న పంటలను కాపాడుకోలేక రైతులు అరిగోస పడుతున్నారని చెప్పారు. రాబోయే పదిహేను రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని, పంట పొలాలు ఎండిపోయే ముప్పు ఉన్నదన్నారు. మేడిగడ్డ దగ్గర కాఫర్ డ్యాం నిర్మించి వెంటనే నీళ్లను ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోయాలని, అక్కడి నుంచి శ్రీరాజరాజేశ్వర జలాశయంలోకి తరలించి కాలువల ద్వారా యాసంగి పంటలకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాజన్న సిరిసిల్ల జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాయకులు జక్కల నాగరాజు, దిటి రాజు ఉన్నారు.


పెద్దపల్లి: కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతులు

# మేడిగడ్డకు మరమ్మతులు చేయండి

- సాగునీరందించి రైతాంగాన్ని ఆదుకోండి
- మంథని నియోజకవర్గ రైతుల డిమాండ్
- పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన

పెద్దపల్లి, ఫిబ్రవరి29: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మేడిగడ్డ బరాజ్‌కు తక్షణమే మరమ్మతులు చేయాలని, మేడిగడ్డతోపాటు అన్నారం బరాజ్‌లో నీటిని నిల్వ ఉంచి రైతులను ఆదుకోవాలని మంథని నియోజకవర్గ రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కాపాడాలని కోరుతూ పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. తలాపునే గోదావరి పారుతున్నా వాడుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. వృథాగా సముద్రంలో కలిసే గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించారన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను నిర్మించి వాటి ద్వారా ఎల్లంపల్లి రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి సాగు నీటిని విడుదల చేశారని గుర్తు చేశారు. గత ఐదేండ్లుగా సాగునీటికి ఏ బాధా రాలేదని, సంతోషంగా పంటలు సాగు చేసుకున్నామని వివరించారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బరాజ్‌లోని రెండు పిల్లర్లు కుంగిపోయాయనే సాకుగా చూపించి మరమ్మతులు చేయకపోవడం సరికాదని సూచించారు. గత ప్రభుత్వంపై అనేక ఆరోపణలు చేస్తూ ప్రాజెక్టును ఎండబెట్టడం వల్ల సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి బరాజ్‌కు వెంటనే మరమ్మతులు చేయించి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇక్కడ రైతులు పెగడ శ్రీనివాస్, రవి, రొడ్డ శ్రీనివాస్, మార్వాక కొమురయ్య, నూకల సురేందర్, కాసిపేట రాములు, చింతలపూడి దేవేందర్ రెడ్డి, దాసరి రవీందర్, ఎరుకల రవి, ఆత్మూరి నర్సయ్య, ఎస్కే బాబు, ఎస్కే షకీల్, గువ్వల చందు, ఆత్మకూరి కుమార్, పసునూటి రాజు, రొడ్డ మల్లయ్య, శీలం విష్ణువర్ధన్ రెడ్డి, మంథని కిష్టయ్య, కన్నూరి బావు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుల వడ్డీపై
# 90 శాతం మాఫీ

కరీంనగర్ కార్పొరేషన్, ఫిబ్రవరి 29 : మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థ పరిధిలోని ఇంటి యజమానులు తమ ఆస్తి పన్నులు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం పన్నులు చెల్లించని యజమానులు ఆస్తి పన్నులపై విధించిన వడ్డీలో వన్ టైం స్కీం కింద 90 శాతం మాఫీతో పన్నులు చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పెండింగ్ ఉన్న ఆస్తి పన్నులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని అధికారులు తెలిపారు. మరో నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఆస్తి పన్నులను వంద శాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నారు.


మొగ్దుంపూర్‌లో నీరు లేక ఎండిపోయిన పొలంలో ఏమిచేయలేక పశువును మేపుతున్న రైతు వెంకటేశ్


మొగ్దుంపూర్ శివారులోని వాగులో ఉన్న బావి పూర్తిగా అడుగంటి పోవడంతో పూడిక తీస్తున్న కూలీలు

# అడుగంటుతున్న ఆశలు

సాగునీరు లేక ఎండుతున్న పంటలు

అన్నదాతల ఆశలు అడుగంటుతున్నాయి. సాగునీటి కష్టాలు తీవ్రమవుతున్నాయి. మొన్నటిదాకా బంగారు పంటలు పండించిన అనేక ప్రాంతాల్లో తండ్లాట మొదలైంది. ఎగువ నుంచి జలాలు రాక, చెరువులు, కుంటల భరోసా లేక ఎవుసం ఆగమైతున్నది. చాలా మండలాల్లో పంట పొలాలు ఎండుతున్నాయి. ఆరుగాలం శ్రమంచిన పంటలు దెబ్బతినడం చూసిన అన్నదాతల కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వాటిని రక్షించుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలో కొందరు బావుల్లో పూడిక తీయిస్తే.. మరికొందరు ఏ ఆధారం లేక పంటలను వదిలేస్తున్నారు. నాడు కేసీఆర్ సర్కారు పాలనలో ఏ బాధా లేకుండా రెండు పంటలు పండించుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీళ్ల కోసం గోస పడుతున్నామని వాపోతున్నారు. ముమ్మందు ఎండలు తీవ్రమవుతాయని, సకాలంలో నీళ్లు రాకపోతే ఎక్కడ కూడా యాసంగి పంటలు చేతికి వచ్చే పరిస్థితి ఉండదని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే రోడ్డెక్కి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు. ప్రభుత్వం పంటలకు నీళ్లిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. లేకుంటే పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకునే వరకు వెళ్తారని హెచ్చరించారు. - కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్


ఎండుతున్న వరిని చూపుతున్న రైతు సంపత్


ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేటలో వరిని మేస్తున్న గొర్రెలు


వోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

# నేటి నుంచి న్యూరో వైద్యుల రాష్ట్రస్థాయి సదస్సు

కరీంనగర్‌లో మూడు రోజుల పాటు నిర్వహణ

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 29: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజులపాటు న్యూరో వైద్యుల 8వ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ పీవీకే కిశోర్ తెలిపారు. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో ఉన్న భద్రకాళి దవాఖానలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సదస్సుకు సంబంధించి వోచర్‌ను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శుక్రవారం కరీంనగర్ శివారులోని వీ కన్వెన్షన్‌లో సదస్సు ప్రారంభవుతుందని, 3వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. ఈ సదస్సు న్యూరో వైద్య విద్యార్థులతోపాటు జూనియర్ వైద్యులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి నిష్ణాతులైన వైద్యులు పాల్గొని న్యూరో విభాగంలో వస్తున్న ఆధునాతన పద్ధతులు, వైద్య విధానాలు, అత్యాధునిక ఆపరేషన్ల విధానంపై వివరిస్తారని తెలిపారు. ఇదే రోజు రెనే దవాఖానలో బ్రెయిన్ ట్యూమర్ అంబర్ డిస్క్ సర్జరీలను సదస్సులో లైవ్‌గా చూపిస్తారని తెలిపారు. చల్మెడ మెడికల్ కాలేజీలో మెదడు, వెన్నెముక నరాల సమస్యలపై వచ్చిన అధునాతన వైద్య పద్ధతుల గురించి తెలియజేస్తారని చెప్పారు. 2న సాయంత్రం నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. 3న సదస్సు ముగింపు ఉంటుందని, వైద్యులు, వైద్య విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ఉమ్మడి జిల్లాకు 823 పోస్టులు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 29 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన డీఎస్సీలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు 823 పోస్టులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా జిల్లాల వారీగా జగిత్యాల జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 99, లాంగ్వేజ్ పండిట్ 39, ఫిజికల్ ఎడ్యుకేషన్ 8, సెకండరీ గ్రేడ్ టీచర్ 161, అలాగే స్కూల్ అసిస్టెంట్ 5, సెకండ్ డిగ్రీ టీచర్ 22, మొత్తం కలిపి 334 పోస్టులు కేటాయించారు. కరీంనగర్ జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 86, లాంగ్వేజ్ పండిట్ 18, ఫిజికల్ ఎడ్యుకేషన్ 114, స్పెషల్ ఎడ్యుకేటర్లు స్కూల్ అసిస్టెంట్ 5, సెకండరీ గ్రేడ్ టీచర్ 15, మొత్తం 245 కేటాయించారు. పెద్దపెల్లి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 49, లాంగ్వేజ్ పండితులు 5, ఫిజికల్ ఎడ్యుకేషన్ 1, సెకండరీ గ్రేడ్ టీచర్ 21, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ 5, సెకండ్ డిగ్రీ టీచర్ 12, మొత్తం 93 పోస్టులు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ 56, లాంగ్వేజ్ పండిట్ 12, ఫిజికల్ ఎడ్యుకేషన్ 4, సెకండరీ గ్రేడ్ టీచర్ 67, స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మూడు టీచర్ 9 మొత్తం 151 పోస్టులు కేటాయించారు. అయితే, ఈ పోస్టులన్నీ గత ప్రభుత్వంలో నివేదికల ఆధారంగా కేటాయించినట్లు తెలుస్తోంది.

# రైస్‌మిల్లులుపై కొరడా

- ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించని వెంకటసాయి, మారుతి ఇండస్ట్రీస్‌పై కేసు

పెద్దపల్లి, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): ఎఫ్‌సీఐకి బియ్యం అప్పగించని రైస్ మిల్లులపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ వివరాలు వెల్లడించారు. మంథని మండలం కూచీరాజ్‌పల్లిలోని వెంకటసాయి, మారుతీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులు ప్రభుత్వానికి నష్టం కలిగించాయని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంథని ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వెంకటసాయి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్‌నర్లు బోడ సంపత్ రెడ్డి, సీహెచ్ అశోక్ కుమార్, పార్ట్‌నర్లు బోడ సరోజన, సీహెచ్ స్వర్ణలతపై, అలాగే మారుతీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు మేనేజింగ్ పార్ట్‌నర్ బీ ప్రకాశ్‌రావు, పార్ట్‌నర్లు బీ వరప్రసాదరావు, ఎం సుమన్ కుమార్‌పై మంథని పోలీసులు ఐపీసీ సెక్షన్ 406, 409, 420 కింద కేసు బుక్ చేశారు. 2022-23 వానకాలం సీజన్‌కు సంబంధించి వెంకటసాయి ఇండస్ట్రీస్ ₹8,50,88, 152 విలువైన 27,876.05 క్వింటాళ్ల సీఎంఆర్ రైస్, మారుతీ ఇండస్ట్రీస్ ₹21,64,05, 173 విలువైన 70,893.56 క్వింటాళ్ల సీఎంఆర్ రైస్‌ను ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించిన ప్రతి ఒక్కరిపైనా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం నిందితుల ఆస్తులు జప్తు చేసి వేలం వేసి ప్రభుత్వ నష్టాన్ని భర్తీ చేస్తామని స్పష్టం చేశారు.

# ప్రమాదపుటంచున మామిడి పంట

- మాడిపోతున్న పూత, కాత
- ఆందోళనలో రైతులు
- ముందు జాగ్రత్తలే మేలు
- శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు


గొల్లపల్లిలో మామిడి తోటలను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

మామిడి పంట ప్రమాదపుటంచుల్లో చిక్కుకున్నది. ఆలస్యంగానైనా విరివిగా పూసిన పూతను చూసి ఆనందంలో మునిగితేలిన రైతాంగం, ఇప్పుడు కాయదశలో మాడిపోతుండడంతో ఆందోళన చెందుతున్నది. గతేడాది ఈదురు గాలులు, అకాల వర్షాలతో నష్టపోతే.. ఈ సారి సైతం నష్టాలు చవి చూడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నది. అయితే తేనేమంచు, బూడిద తెగుళ్లు, ఫ్లవర్ వెబ్బర్, తామర పురుగులు ఆశించడంతోనే పూత మాడిపోతున్నదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నివారణకు తక్షణమే తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జగిత్యాల, ఫిబ్రవరి 29 (నమస్తే తెలంగాణ): మామిడి తోటలు తెలంగాణలోనే అత్యధికంగా జగిత్యాల జిల్లాలో కనిపిస్తాయి. దాదాపు 35 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్నాయి. బంగినపల్లి నుంచి మొదలు కొని దసేరి, మల్లికా, హిమాయత్ లాంటి రకాలు ఇక్కడ సాగు చేస్తున్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలోపాటు చాలా దేశాలకు ఇక్కడి నుంచి మామిడిని ఎగుమతి చేస్తున్నారు. అయితే గత సీజన్‌లో అసలే తక్కువ పూత రావడం, ఆపై అకాల వర్షాలు, గాలి దుమారంతో కాయలు నేలరాలి పంట దెబ్బ తిన్నది. దీనికి తోడు మంగురావడంతో నష్టపోవాల్సి వచ్చింది. అయితే ఈ సారి సీజన్‌లో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతుండగా రైతులు మొదట్లో నిరాశకు లోనయ్యారు. ఆలస్యంగానైనా మంచిగా వచ్చిన పూత, కాత నల్లబడిపోవడం, రాలిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై జగిత్యాల జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్ మామిడి రక్షణకు సలహాలు సూచనలు ఇచ్చారు.

## ఫ్లవర్ వెబ్బర్

ఈ పురుగు లార్వా దశలో ఉన్నప్పుడు లేత గులాబీ రంగు లేదా తెలుపు రంగులో ఉండి బియ్యం గింజ పరిణామంలో పూతకు విపరీతమైన నష్టం కలుగజేస్తుంది. పూత అధికంగా రావడం, గుబురుగా ఉన్నప్పుడు ఈ పురుగులు గూడు అల్లుకొని పూత కాండంలోకి వెళ్లి నష్టం కలిగిస్తాయి. నివారణ కోసం పిప్రోనిల్+ఇమిడాక్లోప్రిడ్ కాంబినేషన్‌లో పురుగు మందును 250 గ్రాములు స్ప్రే చేసుకోవాలి.

## తేనె మంచు పురుగు

ఈ పురుగులు గుంపులు, గుంపులుగా చేరి లేత ఆకులు, పుష్పగుచ్ఛాలు, పూత, పిందెల నుంచి రసాన్ని పీలుస్తాయి. దీంతో పూత, పిందె వడలిపోయి రాలిపోతాయి. ఈ పురుగులు విసర్జించిన తెనే లాంటి పదార్థంపై ఉన్న మసికారమైన శిలీంద్రాలు కాయపై ఏర్పడుతాయి. దీని వల్ల ఆకులు, పూత, కాయలపై నల్లని మసి ఏర్పడుతుంది. తోటల్లో కలుపు ఎక్కువగాను, వాతావరణం మబ్బుగాను ఉండి గాలిలో తేమ శాతం ఎక్కువగా, ఉష్ణోగ్రత తక్కువగా ఉన్నప్పుడు ఈ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగు మామిడి తోటలో ఆవహిస్తే 40 నుంచి వంద శాతం పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

## నివారణ ఇలా..

ఈ పురుగు నివారణకు 500 లీటర్ల నీటికి ల్యాండ సైహలోత్రిన్+థయోమిథాక్సమ్ కాంబినేషన్‌లో 250 ఎం.ఎల్ పురుగు మందును పిచికారీ చేయాలి. అందుకు సంబంధించి మార్కెట్‌లో ఉన్న మంచి ఆలికా, జపాక్, థయో స్టార్ వంటి బ్రాండ్లను వినియోగించుకోవచ్చు. అలాగే హెక్సాకోనజోల్ ఒక లీటర్ + ప్లానోఫిక్స్ 100 ఎం.ఎల్ చొప్పున కలిపి గాలి ఎక్కువగా లేని సమయంలో స్ప్రే చేసుకోవాలి. పూతపూర్తిగా విచ్చుకోకముందే పిచికారీ చేయాలి. పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల పుప్పొడి రాలిపోయి పరపరా సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశించి నష్టం వాటిల్లుతుంది.

## తామర పురుగులు

తామర పురుగులు పిందెలపైన చేరుతాయి. వాటి చర్మంగీకి రసం పీలుస్తాయి. దీంతో పిందె రంగు మారిపోతుంది. కాయ నాణ్యత తగ్గిపోతుంది. తామర పురుగుల నివారణ కోసం ల్యాండ సైహలోత్రిన్ 1 ఎం.ఎల్ లేదా థైయోమోతోక్సం 0.5 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా సోలోమాన్0.5 ఎం.ఎల్ ఒక లీటర్ నీటికి కలిపి నల్లపూత దశలో పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేస్తే తామర పురుగులను నివారించవచ్చు.

## మసి తెగులు

ఆకులు, పూత, పిందెలు, కాయల మీద రసం పీల్చే తేనె మంచు పురుగు, పిండి నల్లి, తామర పురుగులు ఆశించినప్పుడు అవి విసర్జించే తెనే లాంటి జిగురు పదార్థం శిలీంద్రాలుగా పెరిగి నల్లని మసి తెగులు వస్తుంది. కాయలు పెరిగే దశలో అకాల వర్షాలతో ఆకులపైన ఉన్న మసి తెగులు వర్షపు నీటి ద్వారా కాయలకు సోకి మసి మంగుగా మారుతుంది. నల్లని మచ్చలు ఏర్పడి అమ్మకానికి పనికి రాకుండా పోతాయి. నివారణకు ఆకులపై మసి తెగులు ఉన్నతో 100 లీటర్ల నీటికి 2 కిలోల స్టార్చ్ (గంజిపొడి) కలిపి స్ప్రే చేయాలి. చెట్టు పూమొగ్గదశలో ఇమిడాక్లోప్రిడ్ 0.5 మీల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 1గ్రాము, శిలీంద్రనాశినులు అయిన సాఫ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూత దశలో థయోమిథాక్సమ్ 500 లీటర్ల నీటికి 250 గ్రాములు మరియు హెక్సాకోనజోల్ ఒక లీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

## బూడిద తెగులు

చల్లని రాత్రులు, వేడి పగటి వాతావరణం ఉన్న సమయంలో పూత, పిందెపై తెల్లని పొడిలాంటి బూజు ఏర్పడుతుంది. ఈ శిలీంధ్రం ఆశించడం వల్ల పూలు, పిందెలు రాలుతాయి. నివారణకు నీటిలో కరిగే గంధకం (సల్ఫర్) 3 గ్రాములు లేదా హెక్సాకోనజోల్ 2.మీ.లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి, కొమ్మల కత్తిరింపు, సమగ్ర ఎరువులు, నీటి, చీడపీడల యాజమాన్యం, సకాలంలో, సరైన మోతాదులో చేస్తే ప్రస్తుతం ఉన్న బూడిద తెగులు నుంచి పంటను రక్షించుకోవచ్చు.

## పిందె రాలడం

కాతకు వచ్చే తరుణంలో పిందెలు రాలకుండా తగ్గించడానికి లీటర్ నీటికి 2 మిల్లీలీటర్ల ఫ్లానోఫిక్స్ కలిపి పూరెమ్మలు మొత్తం తడిసేలా పిచికారీ చేయాలి. లేదా 2,4-డీ 10పీపీఎం ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

## సూచనలు పాటించాలి



వాతావరణంలో మార్పులతో మామిడితోటలను పురుగులు తీవ్రంగా నష్టపరిచే ప్రమాదం ఉన్నది. రోజురోజుకూ వీటి ఉధృతి ఎక్కువ అవుతుంది. యాజమాన్య లోపాలతో తామర, తేనె మంచు పురుగులు ఆకుజల్లెడ గూడు పురుగులు వ్యాపిస్తాయి. పంటను చీడపీడలు ఆశిస్తే రైతులు వెంటనే ఉద్యానవన అధికారులను సంప్రదించాలి. వారి సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టాలి.

- జే ప్రతాప్ సింగ్, ఉద్యానవన శాఖ అధికారి (జగిత్యాల)